బండి ముత్యాలమ్మ జాతర సందర్భంగా
నేడు, రేపు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలం ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా 216 జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎస్ఐ జి.వాసు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని చెప్పారు. దిగమర్రు నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే వాహనాలు, దిగమర్రు నుండి పాలకొల్లు, భీమవరం, లోసరి మీదుగా మచిలీపట్నం వెళ్లాలని, మచిలీపట్నం నుండి నరసాపురం వైపు వెళ్లే వాహనాలు ముత్యాలపల్లి సెంటర్ మీదుగా వారతిప్ప, వెంప, కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి మీదుగా నరసాపురం వైపు వెళ్లాలని పేర్కొన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అమ్మో ఇంజినీరింగ్ సీటా..
చాలా ఖరీదే..!

- ఇపి సెట్ ర్యాంకులతో సంబంధం లేకుండా పెద్దఎత్తున డొనేషన్ సీట్ల కేటాయింపు
- డొనేషన్ కింద రూ.రెండు నుంచి రూ.ఐదు లక్షల వరకూ వసూలు
- ట్యూషన్ ఫీజు సైతం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికమే
- హాస్టల్ ఫీజు రూ.80 వేల నుంచి రూ.లక్షన్నర
- లోపాల పుట్టగా ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50కుపైగా ఇంజినీరింగ్ కాలేజీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇంటర్ పూర్తయిన తర్వాత ఇంజినీరింగ్ చదవాలనుకునే విద్యార్థులకు ఫీజుల భారం భరించలేని స్థాయికి చేరింది. ఎపి ఇపి సెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకున్నా, లేకున్నా ఏడాదికి రూ.లక్షల ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇంజినీరింగ్ చదవించే విద్యార్థుల తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఎపి ఇపి సెట్‌లో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థికి ఏడాదికి రూ.రెండు లక్షల వరకూ ఖర్చవుతుండగా, ర్యాంకుతో సంబంధం లేకుండా ఇంజినీరింగ్ కాలేజీల్లో కేటాయిస్తున్న సీట్లకు బ్రాంచ్‌ను బట్టి రూ.మూడు లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రంలో మొత్తం 506 వరకూ ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50కు పైగా ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ప్రతి కాలేజీలోనూ తక్కువగా లెక్కించినా అన్ని బ్రాంచీలకు సంబంధించి 300కుపైగా సీట్లు ఉంటున్నాయి. ఈ ప్రకారం చూస్తే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే ప్రతియేటా 20 వేల మందికిపైగా విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి ఇంజినీరింగ్ కాలేజీలోనూ సిఎస్ఇ, ఇసిఇ, ఇఇఇ, సివిల్, మెకానికల్, కెమికల్ కోర్సులతోపాటు, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులు వచ్చాయి. ఇంజినీరింగ్ కాలేజీ ట్యూషన్ ఫీజులను ప్రభుత్వం రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదు వేల వరకూ నిర్ణయించింది. ఎంసెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు ఇతర ఫీజులతో మొత్తంగా ఏడాదికి రెండున్నర లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎంసెట్ ర్యాంకుతో సంబంధం లేకుండా కాలేజీల యాజమాన్యాలు సీట్లు కేటాయిస్తున్నాయి. ఈ సీట్లకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. సిఎస్ఇ సీటుకు డొనేషన్ కింద రూ.ఐదు నుంచి రూ.ఆరు లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. ప్రతియేటా రూ.లక్షా 50 వేలకుపైగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఓ మోస్తరు ఇంజినీరింగ్ కాలేజీలో సైతం డొనేషన్ సీటుకు రూ.రెండు లక్షల వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. డొనేషన్ సీట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. డొనేషన్ సీటులో ఇంజినీరింగ్ నాలుగేళ్లు పూర్తి చేయాలంటే కనీసంగా రూ.15 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎపి ఇపిసెట్ ర్యాంకు తెచ్చుకుని ఇంజినీరింగ్ పూర్తి చేసినా రూ.ఆరు లక్షలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమ పిల్లలను ఇంజినీరింగ్ చదువులు చదివించేందుకు తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కష్టాలు వర్ణనాతీతం

ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ లోపాల పుట్టగా మారింది. గత ప్రభుత్వం నేరుగా విద్యార్థి, తల్లి ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమ చేసింది. దీంతో ప్రభుత్వం ఇచ్చినా, ఇవ్వకపోయినా కాలేజీ యాజమాన్యాలు ముందుగానే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసేవి. అప్పులు తెచ్చి ఫీజు కట్టిన తర్వాత ఎప్పటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజుల బకాయిలను కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదు. దీంతో తల్లిదండ్రులు అప్పులు తెచ్చి మరీ చెల్లించారు. వీటికి వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును సకాలంలో చెల్లించకపోవడంతో తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. తమ పిల్లలను ఇంజినీరింగ్ చదివించాలని ఆశ పడుతున్న తల్లిదండ్రులు ఫీజుల భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఆర్థికంగా భారంగా మారింది.

ముట్టడిలో నినదిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ నేతలు

బదిలీల్లో సమస్యలను పరిష్కరించాలి

ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి లోకేష్ చర్చించాలి
కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి
ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి విద్యాశాఖలో బదిలీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు తాజాగా బదిలీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే డిమాండ్లతో స్థానిక డిఇఒ కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. ముట్టడి కార్యక్రమానికి యుటిఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎంఎల్‌సి గోపీమూర్తి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. మే 19, 20 తేదీల్లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, విద్యాశాఖ కమిషనర్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, దానికి భిన్నంగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ల ఎనేబుల్ చేయడాన్ని ఖండించారు. ఇది ఉపాధ్యాయులను మోసం చేయడమేనని అన్నారు. గతంలో ఎన్నడూ లేని పరిణామాలు, అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులపై తీవ్ర మానసిక ఒత్తిడి పెంచుతున్న వెబ్ ఆప్షన్ల పద్ధతిని విడనాడాలని హితవు పలికారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌లో కూడా అనేక సాంకేతిక సమస్యలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారన్నారు. వేలాదిగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు కూడా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తే దాదాపు రెండు వేల స్క్రీన్లకు ప్రయారిటీ ఇవ్వాల్సి వస్తుందని, ఇది తీవ్ర మానసిక ఒత్తిడికి కారణమవుతుందని, అందుకే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి సమస్యలను తెలియజేశారు. బదిలీల ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించడం కోసం ప్రతి జిల్లా నుండి ఇద్దరు ప్రతినిధులతో సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేయాలని, వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని, అవసరమైన మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేగవంతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా అలీ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, ఎపిటిఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి జి.మోహన్, పిఆర్‌టియు అధ్యక్షులు పువ్వుల ఆంజనేయులు, పిఇటిల అసోసియేషన్ నాయకులు రమేష్‌గోపాల్ ఉమ్మడి జిల్లా నుంచి 500 మంది పైబడి ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఎపి ఇపి సెట్‌లో పాలకొల్లు సాత్విక్‌కు 3వ ర్యాంక్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ ఎపి ఇపిసెట్-2025లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. సాత్విక్ రాజమండ్రి తిరుమల విద్యాసంస్థల్లో చదువుతున్నాడు. సాత్విక్ తండ్రి వెంకట సత్యనారాయణ కౌలు రైతు. తల్లి గీతావాణి గృహిణి. సత్యనారాయణ దంపతుల పెద్ద కుమారుడు తరుణ్ సాయితేజ్ ఇటీవల ఎన్ఐటి భోపాల్‌లో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి రాజస్థాన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు బాలసూర్య నాగేశ్వర్ ఎన్ఐటి అగర్తాలలో ఇఇఇ చేస్తున్నాడు. మూడో కుమారుడైన సాత్విక్ ఇప్పుడు 94.75 శాతం మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు సాధించాడు.

రోజుకు పది గంటలు సాధన చేశా

తాను ప్రతిరోజూ పది గంటలు సాధన చేశానని యశ్వంత్ సాత్విక్ తెలిపారు. ఫలితంగా స్టేట్ ర్యాంకు సాధించానని చెప్పారు. ముంబైలోని ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేయాలన్నది తన కోరికని తెలిపారు.

అగ్రికల్చర్, ఫార్మాలో సత్యవెంకట్‌కు ఐదో ర్యాంకు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడేనికి చెందిన యలమోలు సత్య వెంకట్ ఎపిఇఎపి సెట్‌లో అగ్రికల్చరల్, ఫార్మా విభాగంలో రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించాడు. సత్య వెంకట్ వేలివెన్ను శశి జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపిసి చదివాడు. సత్య వెంకట్ తండ్రి రామకృష్ణ, తల్లి సుచరిత ఇద్దరు డాక్టర్లే. తాడేపల్లిగూడెం భూపాల్‌నగర్‌లో శ్రేయాస్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ అండ్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. సత్య వెంకట్ రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించడం తమకు చాలా గర్వకారణంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. సత్య వెంకట్ మెడిసిన్ చేయనున్నట్లు చెప్పారు. వెంకట్ నీట్ పరీక్ష కూడా రాశాడన్నారు. రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించిన సత్యవెంకట్‌ను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

నిప్పుల కుంపటి..!

బెంబేలెత్తుతున్న జనం
రోడ్లన్నీ నిర్మానుష్యం

నరసాపురంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

ప్రజాశక్తి - నరసాపురం

ఎండలు మండి పోతున్నాయి. రోహిణీ కార్తె వెళ్లిపోయినా ఎండల తీవ్రత తగ్గకపోవడంతో జనం విలవిల్లాడుతున్నారు. దీంతో పగటి వేళల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మండలంలోని సీతారాంపురం, రుస్తుంబాద గ్రామంలో నిత్యం రద్దీగా కనిపించే 216 జాతీయ రహదారి జనాల్లేక వెలవెలబోయింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావడం లేదు. వ్యాపారాలు లేకపోవడంతో దుకాణాలు సైతం మూసివేస్తున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. జ్యూస్, ఐస్‌క్రీమ్ పార్లర్లు రద్దీగా కనిపిస్తున్నాయి.

ఆకివీడు: రోహిణి కార్తె వెళ్లి మృగశిర వచ్చినా ఎండలు మండిపోతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. దీంతో జనం వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సాయంత్రం నాలుగైనా జనం రోడ్లపైకి రాలేని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం తల్లడిల్లుతున్నారు.

షైనింగ్ స్టార్స్ పేరిట విద్యా పురస్కారాలు

నేడు పది, ఇంటర్ విద్యార్థులకు జిల్లాస్థాయి అవార్డులు, నగదు పురస్కారాలు
విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక ఎఎస్ఆర్ సాంస్కృతిక కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న షైనింగ్ స్టార్స్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆమె ఆదివారం పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దీనిలో భాగంగానే 2024-25వ సంవత్సరానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో కూడా ఉత్తమ ప్రతిభ పాటవాలు కనబరిచిన విద్యార్థులకు సోమవారం ఉదయం జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులను అందించి అభినందించడం జరుగుతుందన్నారు. పాఠశాల, ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారిని 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం ద్వారా సన్మానించి, పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన వారిలో మండలం నుండి ఆరుగురు ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 20 మండలాల నుండి 119 మంది పదో తరగతి విద్యార్థులను ఎంపిక చేశారని, అదేవిధంగా జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరందరికీ సర్టిఫికెట్, మెడల్, రూ.20 వేలు చెక్ రూపంలో అందజేయనున్నట్లు చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు
జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్
నేడు మూడు రెవెన్యూ డివిజన్లలో ఆందోళన

భీమవరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 9న జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోరాడి సాధించుకున్న స్టీల్ పరిశ్రమను అమ్మేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం అంటకాగడం రాష్ట్ర గౌరవాన్ని, తెలుగు ప్రజల గౌరవాన్ని తాకట్టు పెట్టడమేనని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రయివేటుపరం కానీయబోమని, అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, స్థానిక ఎంఎల్ఎ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అనేక విభాగాల్లో చాలాకాలం నుంచి పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించి విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని పేర్కొన్నారు.

ఎపి ఇపి సెట్ ఫలితాల్లో శశి విద్యార్థుల హవా

తాడేపల్లిగూడెం : ఆదివారం విడుదలైన ఎపిఇఎపిసిఇటి ఫలితాలలో తాడేపల్లిగూడెం శశి విద్యార్థులు టౌన్ ప్రథమ స్థానం సాధించారని శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ 509 ర్యాంక్ పిఆర్‌విఎస్.దుర్గా చరణ్ టౌన్ ప్రథమ స్థానంలో నిలవగా విటిఆర్.చరణ్ 1115, కె.దేవిక 1305, ఎ.లికేంద్రసాయి 1965 ర్యాంకులు సాధించారు. 3 వేల లోపు ఏడుగురు, 5 వేల లోపు 15 మంది, 10,000ల లోపు 30 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో డిసిహెచ్.శ్రీవిద్యా 4695 ర్యాంక్, 20,000ల లోపు 10 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. ఈ విజయాన్ని అందించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ క్రాంతిసుధ అభినందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం : నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యా దుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.

లాభసాటి వ్యవసాయమే కూటమి లక్ష్యం

మంత్రి నిమ్మల రామానాయుడు

యంత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లాభసాటి వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలో 50 శాతం సబ్సిడీపై 80 మంది రైతులకు క్రిషి ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను కలెక్టర్ నాగరాణి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు, పాలకొల్లు ఎడి పార్వతి, పాలకొల్లు, పోడూరు ఎఒలు రాజశేఖర్, సత్యనారాయణ, ఎడి పార్వతి, కెవికె ఉండి శాస్త్రవేత్త మల్లికార్జునరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి విజయానంద్, సర్పంచి చొప్పల రజిని, నాయకులు కోడి విజయభాస్కర్, పెన్మెత్స వెంకట రామసూరి, నెక్కంటి ఆదినారాయణ, పాముల రజనీకుమార్ గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, అంగర చిన్న, రైతులు పాల్గొన్నారు.

మానవత సేవలు విస్తృత పరచాలి : ఎంఎల్ఎ



తణుకు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తణుకు : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో తాను భాగస్వామ్యం అవుతానని తెలిపారు. 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక గమిని ఫంక్షన్ హాల్‌లో కఠారి శారదాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. మానవతా శాఖ విభిన్న సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ఈ సంస్థకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, ఈ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామిని అవుతానని అన్నారు. ఈ సందర్భంగా సంస్థకు రూ.10 వేల నగదును విరాళంగా రాధాకృష్ణ అందజేశారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. తణుకు శాఖ సభ్యులకు సేవా కార్యక్రమాలకు విరాళాలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 128 మానవతా శాఖలు ఉన్నాయని, ఆపదలో ఉన్న వారికి మానవతా సంస్థ అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్‌వి.సతీష్‌బాబు, ఛైర్మెన్ వివి.రామకృష్ణారావు, కో ఛైర్మెన్ ఆనందం మస్తాన్‌రావు, కన్వీనర్ ఎ.బాలాజీ, ముఖ్య సలహాదారు మల్లిన అరుణసారధి, బొల్లం రామకాశి, ట్రెజరర్ అక్కిన కాశీవిశ్వనాధం, వంగూరి హనుమంతరావు, ఆలపాటి సుబ్బారావు, కఠారి కాశీవిశ్వనాధరాజు, మనవతా సభ్యులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా కడించర్ల రాజరాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు అక్కిన కాశీవిశ్వనాధం, కార్యదర్శి కటారి కాశీ విశ్వనాధరాజు, కోశాధికారి వంగూరి హనుమంతరావు, సహాయ కార్యదర్శి ఒబిలిశెట్టి మురళీహరినాధ్, కార్య నిర్వాహక సభ్యులు, ఎడ్యుకేషన్ ఆర్ఎస్ఎం.భూపాల్, హెల్త్ డాక్టర్ కె.రామలక్ష్మి, ఎవెర్నెస్ ఎలమర్తి శ్రీనివాసరావు, ఎమర్జెన్సీ నిడదవోలు సత్తిరాజు ప్రమాణస్వీకారం చేశారు. నూతన ఛైర్మెన్‌గా కటారి శారదాదేవి, కో ఛైర్మెన్‌గా బొల్లం రామకాశి నియమితులయ్యారు.

విద్య పేరుతో వ్యాపారం

నిద్రమత్తులో జిల్లా విద్యా శాఖాధికారులు
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా విద్య పేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు నటిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యనే వ్యాపారంగా మార్చుకున్న జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఆకివీడు, ఉండి, పాలకొల్లు, ఆచంట ప్రాంతాలలో పుట్టగొడుగుల్లా విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధిక ఫీజులు, పుస్తకాల పేరుతో రూ.వేల కోట్లు దందా చేస్తున్నా ఏమీ పట్టనట్లు అధికారులు నిద్ర నటిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐగా ఆందోళనలు చేస్తున్నా, సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తున్న అన్ని వార్తా పత్రికల్లో అరాచకాలపై వస్తున్నా ఏమీ తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వారితో కుమ్మక్కయ్యారేమోనని అనుమానాలు వెల్లువెత్తుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకొచ్చిన వెంటనే కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికడతామని ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, దాని అమలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారులు నిద్రమత్తు వదిలి విద్య పేరుతో వ్యాపారం చేసే విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మానసిక, శారీరక రక్షణకు కరాటే దోహదం

ముగింపు కార్యక్రమంలో శిక్షకుడు ఘంటా శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆకివీడు

వేసవికాలం సెలవులు పిల్లలకు ఆటపాటలకు, వాటిలో ప్రావీణ్యం సంపాదించేందుకు చక్కని అవకాశం అని కరాటే శిక్షకుడు ఘంటా శ్రీనివాస్ అన్నారు. వాటితో పాటు ప్రతి ఒక్కరికి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి వ్యాయామం చేయడం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆరకమైన వ్యాయామానికి గాను కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బాల్యం నుండే కరాటే శిక్షణ పిల్లలకు అందునా బాలికలకు మానసిక శారీరక రక్షణతో పాటు సామాజిక రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. మాస్టర్ కేశవ కరాటే అకాడమీ ఆంధ్రప్రదేశ్ సంస్థ ఆధ్వర్యంలో మే 25 నుంచి జూన్ 8వ తేదీ వరకు పిల్లలకు కరాటేలో ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షకుడు శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం కేశవ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా వారిచే పిల్లలకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఆయా స్థాయి ప్రమాణాల ఆధారంగా గ్రేడ్లు, కలర్ బెల్టులు బహూకరించారు. ఈ సమ్మర్ క్యాంపులో 50కిపైగా చిన్నారులు, విద్యార్థులు పాల్గొన్నారని శ్రీనివాస్ తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో అతి చిన్న వయస్సులోనే కరాటే విద్యను అభ్యసించిన 3 సంవత్సరాల చిన్నారి అలేటి ఈక్షిత, నాలుగు సం. నందమూరి వేద, వర్షిణిలు తమ ప్రదర్శనతో అబ్బురపరిచి ఎల్లో అండ్ ఆరెంజ్ బెల్ట్‌లు పొందారన్నారు. కార్యక్రమంలో శారద స్కూల్ డైరెక్టర్ వంశీ మాట్లాడుతూ కరాటే మానసికంగా, శారీరకంగాను, ఆరోగ్యవంతంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యజమాన్యం పాల్గొన్నారు.

సముద్ర కెరటాలలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సాగర తీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌ తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

నీలాద్రిపురంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వెంకట రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవి వరప్రసాద్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు నిర్వహణపై భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ(ఐసిఎఆర్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్(ఐఐఓపిఆర్) పెదవేగి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుదారులకు కీలకమైన సూచనలు, నిర్వహణ పద్ధతులను అందించారు. ఆయిల్ పామ్ సాగును లాభదాయకంగా, సుస్థిరంగా ముందుకు తీసుకెళ్లేందుకు తగిన సూచనలు చేశారు. కోకో పంట నిర్వహణ అంశాలపై శాస్త్రవేత్త డాక్టర్ రేఖ వివరించారు. సకాలంలో కత్తిరింపు, పోషకాల నిర్వహణ, జామ తోటలో నిర్వహణ పద్ధతుల గురించి వివరించారు. మిశ్రమ చేపల పెంపకంలో మెరుగైన నిర్వహణ అంశాల గురించి, పాల దిగుబడిని మెరుగుపరచడానికి, పశుగ్రాస రకాలు, దాని నిర్వహణను డాక్టర్ ఎ.దేవి వరప్రసాద్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల రైతులు, గ్రామ సభ్యులు, హేమ, జూనియర్ వెటర్నరీ డాక్టర్, విహెచ్ఎ.వంశీ పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రస్తుత తరుణంలో మనిషి తినే ఆహారం, వాతావరణ కాలుష్యం వల్ల అనేక రకాల ఒత్తిడితో జీవిస్తున్నారని, యోగాతోనే సంపూర్ణ పరిష్కార మార్గమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆదివారం యోగాంధ్ర-25 కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో యోగాపై ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు యోగా, వ్యాయామంపై అవగాహన కల్పించాలన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగా అనేది ఒక్కరోజు కాకుండా ప్రతిరోజూ చేయాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, సోమవారం అల్లూరి స్మృతివనం వద్ద సుమారు 2 వేల మందితో యోగా ర్యాలీ, యోగాసనాలు జరుగుతాయని అందరూ పాల్గొనాలని కోరారు.

రేలా రేలా రేలా నృత్యం చేస్తున్న బృందం

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. యాత్రికులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి మోక అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవ కార్యక్రమం నిర్వహించారు. సాయంకాలం విజయనగరం వారిచే సత్య వెంకట్ నారాయణ గ్రూప్ రేలా రే రేలా, రాజమండ్రికి చెందిన ఉమా శ్రీవాణి కళాకార్ కళానికేతన్ రాజమండ్రి వారిచే కురుక్షేత్రం నాటకం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ప్రజలు తిలకించారు.

మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

టిడిపి ఆధ్వర్యాన పలుచోట్ల నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై అక్కడి మహిళలను కించపరుస్తూ సాక్షి టివి ఛానల్ డిబేట్‌లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ కించపరుస్తూ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ టిడిపి వీరవాసరం మండల శాఖ ఆదివారం డిమాండ్ చేసింది. కించపరుస్తూ మాట్లాడిన జర్నలిస్టు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్, సాక్షి టివి ఛానల్ యాజమాన్యం వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, మట్ల శ్రీరామమూర్తి, వీరవాసరం, బొబ్బనపల్లి గ్రామాధ్యక్షులు ఆరిరెడ్డి గంగారావు, మల్లుల చింతన్న, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కొమ్మవరపు లక్ష్మీనారాయణ, వీరవల్లి గణేష్, కడలి దానేశ్వరావు, కంచర్ల బన్ను పాల్గొన్నారు.

పాలకొల్లు : ఒక ఛానల్ కార్యక్రమంలో అమరావతి రాజధాని, మహిళలపై కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆదివారం పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద టిడిపి మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పాలకొల్లు పట్టణ ఎస్ఐకు వినతిని అందజేశారు.

తాడేపల్లిగూడెం: అమరావతి వేశ్యల రాజధాని అంటూ శనివారం సాక్షి టివి డిబేట్‌లో అసభ్యకరంగా వ్యాఖ్యానించిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుపై కేసు నమోదు చేయాలని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డా.శీరినీడి రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం సాక్షి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాక్షి దిన పత్రికలను తగల బెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తమరాపు రమణమ్మ, జిల్లా కార్యదర్శి రేవతి, తాడేపల్లిగూడెం టిడిపి మహిళా నాయకురాలు కొల్లి రామావతి పాల్గొన్నారు.

తణుకు : వైసిపి పేటిఎం జర్నలిస్టు కృష్ణంరాజు, అతనికి సహకరించి మాట్లాడించిన కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని తణుకు నియోజకవర్గంలో తెలుగు మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ ఎస్ఐ కె.ప్రసాద్, ఎస్ఐ రాజ్యలక్ష్మికు వారు ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం : కొమ్మినేని శ్రీనివాస్, జర్నలిస్టు కృష్ణంరాజులపై చట్టపరమైన చర్యలు తీసుకుని సాక్షి మీడియాను బ్యాన్ చేయాలని నరసాపురం పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మికి టిడిపి మహిళా విభాగం ఫిర్యాదు చేశారు. కొలచన పద్మ, ఎన్.శ్రీ, తిరుమాని లక్ష్మి, వి.దేవి, బేగం, నాగమణి, విజయలక్ష్మి ప్రభృతులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని టిడిపి మహిళా కార్యకర్తలు భూపతి రాజు రాధాదేవి ఆదివారం ఇక్కడ డిమాండ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పుస్తకాలు వచ్చేశాయ్

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి పాలనలో విద్యావ్యవస్థ గాడి తప్పింది. అయిదేళ్లలో పాఠ్యపుస్తకాలు, సంచులు, బూట్లు, బెల్టులు సకాలంలో అందక విద్యార్థులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూసేవారు. పంపిణీ చేసినవి నాణ్యత లేమితో ఉండేవి. ఏడాది పొడవునా వాడాల్సిన సామగ్రి నెలల వ్యవధిలోనే పాడైపోవడంతో విద్యార్థులు అవస్థలు పడేవారు. వీటన్నింటినీ గమనించిన కూటమి ప్రభుత్వం విద్యారంగంపై దృష్టిసారించి ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టింది. రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ముందుగానే పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. పాఠశాలలు తెరిచే నాటికి విద్యాసామగ్రిని అందించనున్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ కలిపి 60 పాఠశాలలున్నాయి. గత విద్యాసంవత్సరం ఒకటి నుంచి 10వ తరగతి వరకు 4,421 మంది విద్యార్థులు చదువుకున్నారు. ఈక్రమంలో గత విద్యాసంవత్సరం చివరిలో సంబంధిత శాఖ వేసిన అంచ నాల ఆధారంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. జూన్ 12న పాఠశాలల పున్న ప్రారంభమవుతుండడంతో తొలిరోజే సామగ్రిని అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కోపల్లె స్టాక్ పాయింట్లో భద్రపర్చిన 4,421 వేల పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలను మండల కేంద్రాలకు దాదాపుగా చేర్చారు. బెల్టులు 3,012, నిఘంటువులు 557, ఏకరూప దుస్తులను స్టాక్ పాయింట్‌లో ఉంచారు. టోటల్ టెస్ట్ బుక్స్ 37,927కు 22,961 టెస్ట్ బుక్స్ వచ్చాయి.

కోపల్లెలో నిల్వ కేంద్రానికి చేరిన పాఠ్య, రాత పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

నిరంతర పర్యవేక్షణ : పాఠ్యపుస్తకాల పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఎంఇఒ-2, మండల ఇంజనీరు, డేటా ఎంట్రీ ఆపరేటర్, సిఆర్ఎంటి నుంచి మరో ముగ్గురు సభ్యులకు కిట్లను మండల కేంద్రంలో చేర్చే బాధ్యత అప్పగించారు. వచ్చిన వాటిని సరి చూసుకుని యాప్లో అప్లోడ్ చేయడం, పాఠశాలలకు చేర్చడం, రోజువారి నివేదికలు రూపొందించడం వంటి బాధ్యతలను నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పేద కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని కొత్త కాలనీకి చెందిన పొదిలాపు రామ్మోహన్‌రావు అనారోగ్యంతో మృతిచెందారు. పేద కుటుంబం కావడంతో మట్టి ఖర్చుల నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకు వచ్చారు. రామ్మోహన్ రావు కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు ఆదివారం అందజేశారు.

మొగల్తూరు సెంటర్లో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్లో ట్రాఫిక్ జామ్‌తో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి ఆర్‌టిసి బస్సు, రెడ్డ్ కారు ఎదురు ఎదురుగా రావడంతో ట్రాఫిక్ జామైంది. దీంతో రహదారికి ఇరువైపులా వాహనాలు ఎక్కువగా నిలిచిపోయాయి. ప్రధాన కూడలిలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి పక్కనే దుకాణదారులు బోర్డులు, వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మొగల్తూరు సెంటర్‌లో నిలిచిన వాహనాలు

ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

టిడ్కో ఇళ్ల కోసం అప్పు చేసిన డబ్బులకు వడ్డీలు కట్టలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. భీమవరం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టిడ్కో ఇల్లు, ప్రభుత్వ లేఅవుట్లలో ఇల్లు, ప్రభుత్వ పోరంబోకు స్థలాలలో నివాసం ఉన్నవారికి ఇళ్ల పట్టాల సమస్య లు పరిష్కరించాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక మెంటేవారి తోటలో నాయకులు ఎం.వైకుంఠ రావు అధ్యక్షతన ఆదివారం జరిగిన టౌన్ కమిటీ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా పేదవాడి సొంత ఇంటి కల నెరవేరలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో నివాసం ఉన్నవారికి 150 గజాలు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ సమస్యలపై ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో లబ్ధిదారులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం టౌన్ నాయకులు డి.త్రిమూర్తులు, బొక్క సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, డి.నాగు, కె.కృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఐదుగురు వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్ అహ్మద్ తణుకు ఉండ్రాజవరం ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురు వృద్ధులకు ఉచిత వైద్యసేవలందించారు. సభ్యులు కె.రామమోహనరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అందజేస్తున్న వైద్యులు

భీమవరంలో నేడు యోగా

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతివనం వద్ద సోమవారం ఉదయం 5:30కు యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. యోగా అనంతరం ర్యాలీ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొననున్నారు.

988 మార్కులొచ్చినా దక్కని ప్రతిభా అవార్డు

పెనుమంట్ర : గ్రామీణ ప్రాంతంలోని జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్ ఎంపిసి ఇంగ్లీష్ మీడియంలో 988/1000 మార్కులు తెచ్చుకుని స్టేట్ ఫిఫ్త్ ర్యాంక్ సాధించినా ప్రభుత్వ ప్రతిభా పురస్కారం మాత్రం ఆ విద్యార్థినికి దక్కలేదు. మండలంలోని పెనుమంట్ర గరువుకు చెందిన ఆంధ్రా అసోసియేషన్(యుకె) జూనియర్ కళాశాల బిసి విద్యార్థిని వివిఎస్ఎస్ఎల్.కామాక్షికి ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి ఇంగ్లీష్ మీడియంలో వెయ్యికి 988 మార్కులు వచ్చి రాష్ట్ర స్థాయిలో ఐదవ ర్యాంక్ సాధించింది. గ్రామీణ ప్రాంతంలో చదివే విద్యార్థుల ప్రతిభకు లోటు లేదని నిరూపించినా, ప్రభుత్వ ప్రతిభా పురస్కారం లభించక పోవడం ఆశ్చర్యం కలిగించిందని పలువురు విద్యావేత్తలు వాపోయారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం 988/1000 మార్కులు వచ్చినా గుర్తింపు ఇవ్వకపోవడం శోచనీయమని వారు అన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఒ.యస్. నెం. 227/2015

బిట్వీన్:

పువ్వల శివరావు ...వాది

మరియు

పువ్వల సావిత్రి (Died) మరియు వగైరాలు ...ప్రతివాదులు

మీరు అనగా 7వ ప్రతివాది తేతలి నాగాంజలి, భర్త: అప్పలస్వామి, బోదిగట్టు, తాడేపల్లిగూడెం అను వారు పై నెంబరు గ్రంధములో ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ తీసుకొనక నిరాకరించు చున్నారు. గాన మీరు ది. **16-06-2025**వ సం.రం ఉదయం గం. **10-30** ని॥లకు లగాయితు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషి తెలుపుకోవలయును. అట్లు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానము జరిగించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి. ఆంజనేయరాజు

తాడేపల్లిగూడెం అడ్వకేటు
తాడేపల్లిగూడెం
సెల్: 98480 18256

ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు

జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పారా మెడికల్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను మన తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో స్థాపించడం మన ప్రాంతానికి గర్వకారణమని జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక యాగర్లపల్లి కమ్యూనిటీ పారా మెడికల్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్, పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన కార్యాలయాన్ని జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అత్యవసర వైద్య సేవలను పిఎంపి ద్వారా అందుకోవచ్చని చెప్పారు. అనారోగ్యాన్ని నివారించడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మీకు సహాయం చేయడంలో ఆరోగ్య సంరక్షణ సేవలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. మెరుగైన వైద్య సేవలను అందించేందుకు యాగర్లపల్లి కమ్యూనిటీ మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. నిస్వార్థమైన సేవాభావంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జనసేన నాయకులు రాజేష్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

అండలూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొండాల గ్రామానికి చెందిన చిత్తిజల్లి జయచంద్రకుమార్, తన భార్య సత్యవతితో కలిసి వాడపల్లి వెళ్లి మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. వీరిరువురూ అండలూరు వద్ద నవుడూరు-పాలకోడేరు ఆర్అండ్‌బి రోడ్డుకు దగ్గర మార్గంగా ఉన్న మరో మార్గం ద్వారా వస్తూ జంక్షన్ వద్ద అటుగా వెళుతున్న లారీ వెనక భాగంలోకి మోటార్ సైకిల్ దూసుకెళ్లినట్టు తెలిపారు. ఈక్రమంలో మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో వెనకాలే కూర్చున్న సత్యవతి మృతిచెందినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న వీరవాసరం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండి

భార్యతో గొడవపడి ఎలకల మందుల ట్యాబెట్లు మింగిన భర్త చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని చిన్నపుల్లేరు గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నపుల్లేరు గ్రామానికి చెందిన ఇందుకూరి కృష్ణంరాజు(42) భార్య శ్రీదేవితో గొడవపడి శనివారం రాత్రి ఇంట్లో ఉన్న ఎలకల మందుల ట్యాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య స్థానికుల సహకారంతో భీమవరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న కృష్ణంరాజు ఆదివారం మృతి చెందడంతో భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే 'షైనింగ్ స్టార్స్'

ఉండి : విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పథకాన్ని తీసుకొచ్చిందని ఉండి మండల విద్యాశాఖ అధికారి బి.జ్యోతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన షైనింగ్ స్టార్స్ పథకంలో భాగంగా మండలంలోని ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థులు కలిశెట్టి డానీ సత్య సాయి కృష్ణ ప్రభాస్, బొండాడ హరిప్రియ, పొట్ల అక్ష, కోలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సుంకర తేజశ్రీ, యండగండి చైతన్య స్కూల్‌కి చెందిన గుత్తుల సూర్యదుర్గారావులు ఎంపికైనట్లు వారు తెలిపారు. పదో తరగతిలో మండల స్థాయిలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం త్వరలోనే అందుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ ప్రోత్సాహకాలు పొందేందుకు మరింత మంది విద్యార్థులు పోటీ పడాలని వారు సూచించారు.

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.

A.A.C.F.No.76/2024

Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
Gudey Lakshmi Bhavani and Others ...Respondents/Opponents.

Opp3: Yadavalli Siva Ranga Rao, S/o.Nageswara Rao, Hindu, Male, a/a 51 Yrs, D.No.1-72, Ramalayam Street, Pedavegi Mdl. Koppaka, West Godavari Dist. Pin.534003. O/o Pilot Aurobindo Emergency Medical Services Eluru.
Opp5: Botcha Aswani Kumar, S/o.Samba Siva Rao, Hindu, Male, a/a 38 Yrs, D.No.2-115/1, 3rd Line Gandhi Nagar, Hanuman Junction, Pin;521105.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP3 & OP5 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.**24-06-2025**వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 24-06-2025

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

E.SRINIVASA BABU
Advocate, Eluru.

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.

A.A.C.F.No.18/2022

Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
Ch.Anitha Venkata Lakshmi and Others ...Respondents/Opponents.

Opp1: Chinta Anitha Venkata Lakshmi, W/o.Syam Kumar, Hindu, Female, a/a 42 Yrs, D.No.16-111, Maha Lakshmi Nilayam, Vidya Nagar, Eluru, West Godavari District. Pin.534007.
Opp2: Damisetty Veerabadra Rama Rao, S/o.Dharma Rao, Hindu, Male, a/a 38 Yrs, D.No.04-3-20/2, KB Singh Road, N.R.Pet, Eluru, West Godavari Dist. Pin.534006. O/o.Police Conistable EMP ID 4530 PC.461, Intelligence Department, A.P., Vijayawada.
Opp4: Sangadala Nirmala, W/o.Kampa Ravi Prasad, Hindu, Female, a/a 48 Yrs, D.No.1-8, ST Colony, Lakkavaram, Janga reddygudem, West Godavari District. Pin.534451. O/o.Senior Assistant EMP ID.1101960 District Educational Officer, West Godavari, Eluru.
Opp5: Paladugu Venkata Veera Bhaskar, S/o.Venkateswara Rao, Hindu, Male, a/a 57 yrs, R/o.D.No.23B-4-31, RR Pet Subbamma Devi School Road, Eluru, West Godavari District. Pin.534002.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP1,2,4,5 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.**24-06-2025**వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 24-06-2025

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

E.SRINIVASA BABU
Advocate, Eluru.

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, జంగారెడ్డిగూడెం

O.S.No.183/2021

1.Sri Shaik Mahaboobjani ...Petitioner/Plaintiff
Vs
2.Sri Tiparthi Gruha Murthy ...Respondent/Defendant

టు:

ప్రతివాది : తిపర్తి గృహమూర్తి, సుబ్రహ్మణ్యం, గ్రామపంచాయతీ, ఉద్యోగి, కొప్పర్రు గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

ఈ నంబరు దావాలో శ్రీకోర్టు వారు మీకు దావా సమన్లు రిజిష్టరు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను ఎన్నిమార్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకోకుండా Avoid చేయుచున్నందున శ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, జంగారెడ్డిగూడెం వారి అనుమతితో పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. ది.16-06-2025 తేది సమయం గం.10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపున న్యాయవాది వారి ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.

కోర్టు వారి అనుమతితో

మోదేపల్లి నాగులు, న్యాయవాది,
జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం
తేది.08-06-2025 సెల్: 9640719598

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.

A.A.C.F.No.13/2022

Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
S.T.P.Madhavi and Others ...Respondents/Opponents.

Opp2: Merajothu Hanuma Kumar, S/o.Jagan Naik, Hindu, Male, a/a 41 yrs, D.No.16B-10-14 , Lankapeta, 4th Road, Tangeliamudi Beside New Ramalayam, Eluru, West Godavari District, Pin.535005. O/o.School, As School Assistant, Hindu, Subbamma Devi Municipal High School, Eluru.
Opp4: Katta Venkata Narasamma, W/o.Venkateswara Rao, Hindu, Male, a/a 59 Yrs, D.No.2-5-53, N.R.Pet, Near Reliance Office Eluru, West Godavari District, Pin.535002, O/o.Office Sub oridante Accounts Officer Cheif Plainning Office Collectorate West Godavari, Eluru.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP2 & OP4 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.**24-06-2025**వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 24-06-2025

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

E.SRINIVASA BABU
Advocate, Eluru.

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా.

A.A.C.F.No.75/2024

Between:
M/s.Shriram Chits (India) Pvt. Ltd., Eluru ...Petitioner/DHr.
(Formerly known as M/s.Shriram Chits Pvt.Ltd., ..Eluru)
And
B.Soma Raju and Others ...Respondents/Opponents.

Opp1: Bangaru Somaraju, S/o.Suryanarayana, Hindu, Male, a/a 34 Yrs, D.No.2-5, Varigedu, West Godavari, Andhra Pradesh, Pin:534225.
Opp2: Vaddadi Durga Bhavani, W/o.Eswara Rao, Hindu, Female, a/a 38 Yrs, D.No.14-10-8 Pension Line Back side Pasuvula Hospital, Eluru Mandalam, 11th Division Eluru, Pin:534005. O/o PH Worker in public Health Section Municipal Corporation, Eluru.
Opp4: Samanthula Sankara Rao, W/o.Lakshmana Swamy, Hindu, Male, a/a 42 Yrs, D.No.13-4-3/2, Railway Quarters Near Railway station Railway colony, Eluru. Pin: 534005. O/o.Track maintainer TRACK MNTR II SCR Vijayawada.

పై నంబరు దావాలో అపొనెంట్స్ OP1,2,4 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం ది.**24-06-2025**వ తేదీన వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉదయం 10.30 ని॥లకు శ్రీడిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 24-06-2025

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/s.శ్రీరామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

E.SRINIVASA BABU
Advocate, Eluru.